క్లుప్తంగా

పారిశుధ్యంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న కమిషనర్ సమ్మయ్య

హుజూరాబాద్: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని విద్యార్థులకు పారిశుధ్యంపై ప్రధానోపాధ్యాయులు అవగాహన కల్పించాలని ఎంఈవో భూపతి శ్రీనివాస్ సూచించారు. పట్టణంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య హాజరై మాట్లాడారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా 19న పట్టణంలో నిర్వహించే చెత్త సేకరణ, పారిశుధ్యంపై అవగాహన కోసం పిల్లలతో పారిశుధ్యంపై ఎగ్జిబిట్స్ తయారు చేయించి ప్రదర్శన ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రావుల భూపాల్ రెడ్డి, హుజురాబాద్ ట్రస్మా అధ్యక్షుడు వకులాభరణం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పొరెడ్డి రవీందర్‌రెడ్డి, కోశాధికారి దాసరి కోటేశ్వర్ యాదవ్, సభ్యులు విన్సెంట్ జార్జ్, పరాంకుశం కిరణ్ కుమార్, అమరేందర్‌గౌడ్, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

వీడ్కోలు హంగామా



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

హుజూరాబాద్: మండలంలోని కందుగుల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం వీరన్న నాయక్, ఏఏపీసీ చైర్‌పర్సన్ సరిత, ఉపాధ్యాయులు మహేంద్రరెడ్డి, రజనీ, పలువురు మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందజేత



సరిఫికెట్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు టెడ్ ఎడ్ అప్రీసియేషన్ సర్టిఫికెట్లను శుక్రవారం మండల విద్యాధికారి రామయ్య, హెచ్‌ఎం శారదలు అందజేశారు. జంగపల్లి పాఠశాలకు ఇటీవల టెడ్‌ఎడ్ లైసెన్స్ లభించింది. ఇందులో భాగంగా విద్యార్థులు వేదికను ఉపయోగించుకుని ఇంగ్లిష్‌లో వివిధ అంశాలపై అనర్గళంగా ఉపన్యాసించారు. వీడియోలను టెడ్‌ఎడ్ న్యూయార్క్‌కు అప్‌లోడ్ చేయడంతో విద్యార్థులు హాసిని, సాత్విక, వర్షిణి, శ్రీజ, దీక్షిత సర్టిఫికెట్లకు అర్హత సాధించారని తెలిపారు. విద్యార్థులు ఇంగ్లిష్ నైపుణ్యం పెంపొందించుకోవడానికి ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగపడుతాయని, విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని మిగతా విద్యార్థులు భాషా సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు వసుంధర, శ్రీనివాస్, రాజమౌళికి టీచర్ ఎడ్యుకేటర్ సర్టిఫికెట్లు అందజేశారు.

కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలి

వీణవంక: కొత్త రేషన్‌కార్డులు ఇవ్వకుండా సన్న బియ్యం ఎలా పంపిణీ చేస్తారని, కార్డులు మంజూరు చేసిన తర్వాతనే బియ్యం పంపిణీ చేయాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు రాపర్తి అఖిల్‌గౌడ్ అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని, ఆరు గ్యారంటీలు అమలు లేదని, రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం కుటుంబాలను పరామర్శించడం లేదన్నారు. రుణమాఫీ అంటూ రైతులకు శఠగోపం పెట్టిందని, రైతుల గోస తప్పక తగులుతుందన్నారు.

జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

హుజూరాబాద్: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఒక్కో గ్రామ పంచాయతీలో మూడు నుంచి ఆరు నెలల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర యూనియన్ నాయకత్వంతో చర్చించి పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు. సమావేశంలో నాయకులు ఇమ్మడి శ్రీకాంత్, రాజు,బిక్షపతి,సారయ్య, వంశీ,స్వామి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పొలంబాట



గన్నేరువరం: మండలంలోని చాకలివానిపల్లెలో శుక్రవారం విద్యుత్‌శాఖ అధికారులు డీఈ ఉపేందర్, ఏడీఈ నరేందర్, ఏఈ ఆంజనేయులు పొలంబాట నిర్వహించారు. విద్యుత్ ప్రమాదాలు, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. మోటార్ల వద్ద కెపాసిటర్లు వాడడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. కెపాసిటర్లు ఏర్పాటు చేసుకొని సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. లూజ్‌లైన్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు ఇతర సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయనున్నామని, సమస్యలను స్థానిక సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని వివరించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



జమ్మికుంట: వావిలాల పీహెచ్‌సీ పరిధి జమ్మికుంట ఆరోగ్య కేంద్రం–1లో నిక్షయ్ పోషణ యోజన పథకంలో భాగంగా డాక్టర్ చందన ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నియంత్రణ సంస్థ ద్వారా టీబీ మందులు వాడుతున్న వారికి శుక్రవారం పోషకాహారం కోసం రూ.1000, న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. టీబీ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి మందులను వాడితే పూర్తిగా నయమవుతుందన్నారు. వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం అందించే ఉచిత మందులు, నగదు, న్యూట్రిషన్ కిట్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ రత్నకుమారి, టీబీ సూపర్‌వైజర్ దేవేందర్‌రెడ్డి, ఆరోగ్యశాఖ సిబ్బంది సరళ, మంజుల, సాజిదా, రజిత, రాధ, నరేందర్, ఎన్జీవో తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

హుజూరాబాద్: వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జి హెచ్చరించారు. సీపీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలో నెంబర్ ప్లేట్ లేని వాహనాలు, మైనర్ డ్రైవింగ్‌పై స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, నెంబర్ ప్లేట్, మైనర్లు డ్రైవింగ్‌కు పాల్పడిన వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని సూచించారు. మైనర్లకు వాహనాలిస్తే యాజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో హుజూరాబాద్ టౌన్ సీఐ తిరుమల్‌గౌడ్, రూరల్ సీఐ వెంకట్‌గౌడ్, జమ్మికుంట టౌన్, రూరల్ సీఐలు వరంగంటి రవి, కిషోర్, ఎస్‌ఐ యూనిస్ అహ్మద్, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



హుజూరాబాద్: మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌జి

రోడ్డుపై ధాన్యం ఆరబోయొద్దు

మండలంలో వరి కోతలు మొదలయ్యాయని, రైతులు రోడ్డుపై ధాన్యం ఆరబోయొద్దని టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడంతో రాత్రివేళ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చోటు చేసుకున్నాయని తెలిపారు.

జమ్మికుంట: పట్టణంలోని ప్రధాన కూడలి వద్ద టౌన్ సీఐ రవి ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నెంబర్ ప్లేట్, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, లైసెన్స్ లేకుండా, మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దని, వాహనాలకు సంబంధించిన పత్రాలను వెంట ఉంచుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో శుక్రవారం నంబర్ లేని వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. కేశవపట్నం అంబేడ్కర్ విగ్రహం నుంచి గ్రామంలోకి వెళ్లే బైక్‌లను ఏఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేశారు. నంబర్‌లేని



జమ్మికుంట: అవగాహన కల్పిస్తున్న టౌన్ సీఐ రవి

వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొంత మంది నంబర్‌ప్లేట్‌లేని వాహనాలపై తిరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపించారు.



‘వాగేశ్వరి’లో క్యాంపస్ డ్రైవ్

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని వాగేశ్వరి ఫార్మసీ కళాశాలలో మెడ్‌ప్లస్ ఆధ్వర్యంలో శుక్రవారం క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. విద్యార్థులకు కంపెనీ పూర్తి వివరాలను వివరించారు. అనంతరం, రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులకు రాత పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొనగా, 108 మంది ఎంపికయ్యారని కళాశాల యాజమాన్యం తెలిపింది. విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి శ్రీని వాస్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శి డి. శ్రీనివాస్ రెడ్డి, సభ్యులు సీహెచ్. ప్రకాశ్‌రెడ్డి, వి. వినోద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాళ్లు ఎమ్. శ్రీనివాస్ రెడ్డి, ఆర్. రామకృష్ణ, ఎన్‌ఐసీ కోఆర్డినేటర్ ఎ.శ్రవణ్ కుమార్, విభాగాధిపతులు, ప్లేస్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న సమ్మయ్య

హుజూరాబాద్: ఆస్తిపన్ను వసూలులో హుజూరాబాద్ మున్సిపాలిటీని రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిపిన కమిషనర్ సమ్మయ్య హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సీడీఎంఏ శ్రీదేవి చేతుల మీదుగా ప్రశంసాపత్రం, అవార్డు అందుకున్నారు. వందశాతం పన్నుల వసూలుకు సహకరించిన మున్సి పల్ ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలకు సమ్మయ్య ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ గందె రాధిక, మేనేజర్ భూపాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేశారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరే లక్ష్యం

హుజూరాబాద్: నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా విద్యుత్ సంస్థ పనిచేస్తోందని నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఇన్‌చార్జి డైరెక్టర్ మధుసూదన్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్‌ను కరీంనగర్ సూపరింటెండెంట్ ఇంజినీర్ రమేశ్‌బాబు అధ్యక్షతన శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉద్యోగులు లక్ష్మారెడ్డి, చంద్రమౌళి, కాళిదాస్, శ్రీనివాస్, అంజయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంపద వనాల సందర్శన



మొక్కలను పరిశీలిస్తున్న షఫీయుల్లా

తిమ్మాపూర్: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మండలంలోని మహాత్మానగర్‌లో ఏర్పాటు చేసిన సంపద వనాలను స్పెషల్ కమిషనర్ షఫీయుల్లా శుక్రవారం పరిశీలించారు. ‘దశాబ్ది సంపద వనాలు, ప్లాంటేషన్’ను సందర్శించి అందులో పెంచుతున్న వివిధ రకాల గూర్చి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీకి అదనపు ఆదాయాన్ని ఇచ్చే మొక్కలను పెంచినందుకు క్షేత్రస్థాయి సిబ్బందిని అభినందించారు. అనంతరం సంపద వనంలో ఒక మొక్కను నాటారు. గ్రామంలో నిర్వహిస్తున్న నర్సరీని సందర్శించి అందులో పెంచుతున్న మొక్కల గూర్చి తెలుసుకున్నారు. పండ్లు, ఎక్కువ నీడనిచ్చే మొక్కలను పెంచాలని సూచించారు. ప్లాంటేషన్ ఎస్పీఎం నర్సింగరావు , డీఆర్డీవో శ్రీధర్, ఏపీడీ పి.కృష్ణ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

గంగాధరలో కార్గో సేవలు ప్రారంభం



కార్గో సేవలు ప్రారంభిస్తున్న రామారావు

గంగాధర: ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని కార్గో సేవల ఇన్‌చార్జి రామారావు సూచించారు. గంగాధర బస్టాండులో శుక్రవారం కార్గో సేవలను ప్రారంభించారు. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు ఆర్టీసీ సేవలు అందిస్తుందన్నారు. గంగాధర చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కళలు అంతరించిపోవద్దు



కళాకారులను అభినందిస్తున్న కొమురయ్య

చిగురుమామిడి: కళలు అంతరించిపోకుండా నేటి తరానికి తెలియపర్చేందుకే చిడతల రామాయణం, శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్ర, తదితర నాటికలను ప్రదర్శిస్తున్నట్లు కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమురయ్య తెలిపారు. ఓగులాపూర్‌లో చిడతల రామాయణం, పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర నాటికను ప్రదర్శించిన శ్రీరామాంజనేయ భజన భక్తమండలి సభ్యులను శుక్రవారం అభినందించారు. కళాకారులకు మెమోంటోలు, జ్ఞాపికలు బహూకరించిన బూడిద సదాశివ–శైలజ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి స్వామి, జిల్లా నాయకులు తిరుపతి, మండల అధ్యక్షులు మల్లికార్జున్‌రెడ్డి, మొగిలి, రవి, సంపత్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీమంతం, అన్నప్రాసన

చొప్పదండి/మానకొండూర్/రామడుగు/గంగాధర/వీణవంక/శంకరపట్నం: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం సభలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఇతర అధికారులు సూచించారు. అనంతరం ప్రీ స్కూల్ మేళ, గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర



చొప్పదండి: సాంబయ్యపల్లిలో పాదయాత్ర

చొప్పదండి/మానకొండూర్/గన్నేరువరం/జమ్మికుంట/ఇల్లందకుంట/వీణవంక: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. మతతత్వ శక్తులనుంచి రాజ్యాంగాన్ని కాపాడాలన్నారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గాంధీజీ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని, రాజ్యాంగాన్ని అందించి స్వేచ్ఛను ఇచ్చిన మహనీయుడు అంబేద్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో బీజేపీని గద్దె దించకుంటే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు.

బాధ్యతలు స్వీకరణ

చిగురుమామిడి: చిగురుమామిడి ఎస్సై గా సందబోయిన శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 18 నెలలుగా విధులు నిర్వహించిన బి. రాజేశ్ కరీంనగర్‌కు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్సై శ్రీనివాస్ మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషిచేస్తానని, యువత చెడు మార్గాలను వీడాలని సూచించారు.

పోలీస్ స్టేషన్ సందర్శన



చొప్పదండి: పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌ను మండలంలోని రెవెల్లి యూపీఎస్ విద్యార్థులు శుక్రవారం సందర్శించారు. ఎఫ్‌ఐఆర్ నమోదు, నిందితుల అరెస్ట్, తదితర సేవలపై పోలీసులు అవగాహన కల్పించారు. విద్యార్థులే ఎక్కువగా సైబర్ మోసాలకు గురవుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. లక్ష్య సాధనలో భాగంగా విద్యార్థులను పోలీస్‌స్టేషన్ సందర్శనకు తీసుకెళ్లినట్లు హెచ్‌ఎం ఆనందం, ఉపాధ్యాయుడు కుమార్ తెలిపారు.

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశ గొప్పతనం



రుక్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శన

చొప్పదండి: భిన్నత్వంలో ఏకత్వం భారత దేశ గొప్పతనమని ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమ కన్వీనర్ సుంకె ఉమాదేవి అన్నారు. మండలంలోని రుక్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హర్యానా రాష్ట్ర ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలను విద్యార్థులు ప్రదర్శించారు. ఇతర రాష్ట్రాల్లోని విద్యార్థులు ఆయా రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుంటారని ఉమాదేవి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పసుపునూరి శ్రీధర్, టీచర్లు గట్టు శ్రీవాణి, మాధవరపు శారద, సముద్రాల అంజయ్య, సంగనభట్ల సురేందర్ పాల్గొన్నారు.



జమ్మికుంట: పట్టణంలోని మడిపల్లి రైల్వేగేట్ వైపు వెళ్లే మిల్లుల రోడ్డుపక్కన చెత్తాచెదారం, ప్లాస్టిక్, కుళ్లిన ఆహార పదార్థాలు పడేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. అటువైపు వెళ్లే వాహనదారులు, మిల్లుల్లో పనిచేసే హమాలీ కార్మికులు దుర్వాసన భరించలేకపోతున్నారు. సంబంధింత అధికారులు స్పందించకుంటే రోగాలబారినపడతామని వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు చెత్తను తొలగించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ఎండీ అయాజ్, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్, సెల్ నంబర్: 89787 78080

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

సన్మానం



సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు

హుజూరాబాద్: పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హుజూరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కాయిత రాములు, కామని రవీందర్‌ను శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు, మాజీ కౌన్సిలర్లుతదితరులున్నారు.

ఆర్టీసీ సూపరింటెండెంట్‌కు రిటైర్డ్ కార్మికుల వినతి

హుజూరాబాద్: రిటైర్డ్ ఆర్టీసీ కార్మికుల పిలుపు మేరకు పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదుట రిటైర్డ్ కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. 2017లో సవరించిన రెండు పేస్కేల్ ఏరియర్స్, డీ ఏరియర్స్, 2022 నుంచి అందాల్సిన లీవ్ ఇంక్రిమెంట్ బకాయిలు, సూపర్ లగ్జరీలో వృద్ధులకు ఫ్రీ ప్రయాణం, మృతిచెందిన రిటైర్డ్ కార్మికుల దహనసంస్కారాలకు అదే రోజు రూ.30 వేల నగదు అందించాలన్నారు. అనంతరం సమస్యలపై ఆర్టీసీ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో రిటైర్డ్ కార్మికులు వీవీఆర్ రెడ్డి, ఎల్.సారయ్య, శుభవర్ధన్, ప్రభాకర్‌రెడ్డి, రవీందర్, ప్రభాకర్, పీఎల్ రావు, వెంకటస్వామి, నారాయణలున్నారు.

తేజస్ విద్యార్థులకు ‘ఆర్మీ’లో ఉద్యోగాలు

కొత్తపల్లి(కరీంనగర్): కొత్తపల్లిలోని తేజస్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ఇండియన్ ఆర్మీ, ఇండియన్ నేవీలో ఉద్యోగాలు సాధించినట్లు అకాడమీ, జూనియర్ కళాశాల చైర్మన్ సీహెచ్ సతీశ్‌రావు తెలిపారు. స్థానిక తేజస్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ వివరాలు వెల్లడించారు. గతేడాది మార్చిలో గచ్చిబౌలిలో జరిగిన ఆర్మీ ర్యాలీలో అత్యున్నత మెరిట్ సాధించిన 102 మంది ఇండియన్ ఆర్మీ ఉద్యోగాలకు, గతేడాది జరిగిన నియామక ప్రక్రియలో ఇండియన్ నేవీ ఎస్‌ఎస్‌ఆర్ ఉద్యోగాలకు 10 మంది విద్యార్థులు ఎంపికైనట్లు చెప్పారు. అగ్నివీర్ పథకం ద్వారా ఆర్మీకి ఎంపికైన విద్యార్థులు ఈనెల 5 నుంచి ఏఆర్‌వో సికింద్రాబాద్‌లో, నేవీకి ఎంపికైన విద్యార్థులు ఈనెల 14ను చిలుక ట్రైనింగ్ కేంద్రంలో రిపోర్టు చేయాలని తెలిపారు. ప్రణాళికాబద్ధమైన విద్యనందించడంతోపాటు విద్యార్థులు ఫిజికల్‌గా ఫిట్‌నెస్ సాధించేందుకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అకాడమీ నంచి ఇప్పటివరకు 2 వేలకు పైగా విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న సతీశ్‌రావు

స్కూల్ బ్యాగులు అందజేత

సైదాపూర్: వెన్నంపల్లి స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో బడి బయట పిల్లలను శుక్రవారం పాఠశాలల్లో చేర్పించారు. అనంతరం ఎంఈవో కె.శ్రీనివాస్‌రెడ్డి పిల్లలకు స్కూల్ బ్యాగులు అందజేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చి కోళ్ల ఫారాలు, ఇటుక బట్టీలు, హోటళ్లలో పనిచేసేవారి పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారని, పిల్లలకు రవాణా సౌకర్యం కూడా కల్పించినట్టు ఎంఈవో తెలిపారు.



స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా:
9951602934, 9951602933, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : మొండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : రాములు - 9160083195
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899